క్లుప్తంగా

నేడు మండల మీట్

బి.కొత్తకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. ఎంపీపీ లక్ష్మీ నరసమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీల హాజరుకావాలని కోరారు. గత వారం మండల మీట్ నిర్వహించగా సభ్యుల కోరం లేకపోవడంతో వాయిదా వేసి ఇప్పుడు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడి, స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. కురబలకోట మండలం మండెంవారిపల్లెకు చెందిన గంగులప్ప కుమారుడు టి.నాగరాజ(60) సొంతపనులపై ద్విచక్రవాహనంలో అంగళ్లకు వచ్చి తిరిగి వెళుతుండగా, గోల్డెన్ వ్యాలీ కళాశాల వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా మదనపల్లె పట్టణం నెహ్రూబజార్‌కు చెందిన కే.చంద్రశేఖర్(73) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో నిమ్మనపల్లె బైపాస్‌రోడ్డులో వెళుతుండగా, ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గర్నిమిట్ట యల్లమ్మకు విశేష పూజలు



కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మకు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు మంగళ వాయిద్యాలతో బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణ నిర్వహించి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి



బి.కొత్తకోటలో కెంపేగౌడకు నివాళి అర్పిస్తున్న నాయకులు

బి.కొత్తకోట: కెంపేగౌడ 515 జయంతిని ఆదివారం స్థానిక జ్యోతిచౌక్‌లో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన మొరుసుకాపు ప్రతినిధులు హాజరై కంపేగౌడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొరుసుకాపు సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ మొరుసుకాపులు కెంపేగౌడను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మొరుసుకాపు ప్రతినిధులు పాల్గొన్నారు.

పీలేరు పంచాయతీ అక్రమాలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న సంఘటనలపై విచారణ జరపాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం, మూడు సంవత్సరాల మూడు నెలల కాలంలో ఇరువురి సర్పంచ్‌ల హయాంలో ఏమి అవినీతి జరిగిందో ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి నరసింహులు, డప్పు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రాజంపేట టౌన్ : స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో వివిధ జబ్బులకు సంబంధించిన రోగులు పాల్గొనగా డాక్టర్ మాలేపాటి వెంకట్రామ్ వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేయడంతోపాటు 750 రూపాయల విలువ చేసే బీఎండీ టెస్ట్‌ను కూడా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వెంకట్రామ్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేదంలో మందులు ఉన్నాయన్నారు.

ఉజ్వల భవితకు ఒకేషనల్ మార్గం

- బాలికల జూనియర్ కాలేజీలో కొత్త కోర్సులు
- విద్యార్థినులకు మంచి అవకాశం
- ఉపాధి కోర్సులకు డిమాండ్



ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ

మదనపల్లె సిటీ: పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరుతున్నారు. సాధారణ కోర్సులతో పాటు విభిన్న కోర్సులు ఇంటర్మీడియట్‌లో ఉన్నాయి. ఎప్పటి నుంచో వస్తున్న బైపీసీ, ఎంపీసీ, సీఈసీ కోర్సులతో పాటు కొత్త కోర్సులు ఉన్నాయి. మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ,హెచ్ఈసీ కోర్సుతో పాటు పలు ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. ఒకేషనల్ కోర్సులు విద్యార్థినులకు మంచి అవకాశం. ఈ కోర్సుల వల్ల ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

అభిరుచి ఉన్న వాటిలో చేరుదాం

యుక్త వయసులో ఉన్నటువంటి విద్యార్థులు తోటి స్నేహితులు చెప్పారనో.. పక్కింటి కుర్రాడు అన్నాడనో.. తల్లిదండ్రులకు ఇష్టమైన కోర్సుల్లో చేరాలనుకుంటారు. చాలా మంది విద్యార్థి అభిరుచి కి అనుగుణంగా కోర్సులు తీసుకొని చదవాలని నిపుణులు సూచిస్తున్నారు. కొందరు వైవిధ్య భరిత కోర్సులు తీసుకుని మధ్యలోనే చదవకుండా కళాశాల మానేస్తుంటారు. దాని వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. దీని వల్ల సమయంతో పాటు ధనం కూడా వృథా అవుతుందని విద్యావేత్తలు చెబుతున్నారు. చేరే ముందే ఆయా కోర్సుల గురించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

- నూతన కోర్సులు ఇవీ..

- అకౌంట్స్ అండ్ టాక్సేషన్ (ఏ అండ్ టీ)
- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్ డబ్ల్యూ) (నర్సింగ్)
- గార్మెంట్ టెక్నాలజీ (సీజీటీ)
- సిరికల్చర్ (మల్బరీ)
- సీఈటీ (కంప్యూటర్ టెక్నాలజీ)

సాధారణ కోర్సులు ఇవీ..

- ఎంపీసీ, బైపీసీ
- సీఈసీ, హెచ్ఈసీ

మీడియం : ఇంగ్లీషు, తెలుగు

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి



ఒకేషనల్ కోర్సులు చేయడం వల్ల ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగంలో చేరవచ్చు. అడ్మిషన్లు జరుగుతాయి. ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కోర్సులు ప్రారంభించారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

-బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్, బాలికల జూనియర్ కాలేజీ,మదనపల్లె

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు



అబూబకర్, భానుప్రకాషలను సన్మానిస్తున్న ప్రజాచైతన్యస్రవంతి సభ్యులు

మదనపల్లె సిటీ: నిస్వార్థంగా అబూబకర్‌సిద్దిక్, భానుప్రకాష్ చేస్తున్న సేవలతో మదనపల్లెకు గుర్తింపు వచ్చిందని ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో ప్రజా సేవలకు హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, వివేకానంద ఆశయం ఫౌండేషన్ ఫౌండర్ గుంపు భానుప్రకాష్‌లను సేవా పురస్కారాలును అందజేశారు. గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ అబూబకర్‌సిద్దిక్ రక్తదానలు చేయడంతో పాటు ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నారన్నారు. కరోనా సమయంలో ఎన్నో అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారన్నారు. భానుప్రకాష్ బ్లడ్‌క్యాంపులు నిర్వహించి ఎంతో మందిని ఆదుకున్నారన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ. క్రిష్ణమూర్తి, ప్రసాదరావు, భవానీప్రసాద్, లైబ్రేరియన్ వసంతకుమారి, ప్రజాచైతన్య స్రవంతి కార్యదర్శి నాగభూషణరావు పాల్గొన్నారు.

అధికారులకు రాజకీయరంగు ఆపాదించవద్దు

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



మదనపల్లె : స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న పోలీసు, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులకు రాజకీయరంగును ఆపాదించి, కక్ష సాధింపులకు పాల్పడవద్దని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉన్నత అధికారుల సూచనల మేరకు కిందిస్థాయి అధికారులు విధులు నిర్వహించారే తప్ప, రాజకీయ కక్షలతో వారికి సంబంధం ఉండదన్నారు. పాలకులు ప్రభుత్వ ఉద్యోగులపై కక్ష సాధింపులు మానుకోవాలన్నారు. ఉద్యోగులకు ఉన్న అధికారాల మేరకు రాజ్యాంగబద్ధంగా పనిచేసేందుకు పాలకులు సహకరించాలే తప్ప, వారిని వేధించడం తగదన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో కొంతమంది పోలీసు అధికారులు వారికి తొత్తులుగా పనిచేశారని నిందలు మోపుతూ, ఉద్యోగులకు రాజకీయ రంగు పులమడం సమంజసం కాదన్నారు. నీతి, నిజాయితీతో, రాజ్యాంగబద్ధంగా పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు ఏఐటీయూసీ ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయసాధనకు కృషి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె : బీజేపీ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రాజంపేట పార్లమెంటరీ బీజేపీ ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకులకృష్ణమూర్తిలు తెలిపారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పట్టణఅధ్యక్షులు బర్నేపల్లె రవికుమార్ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి(బలిదాన దివస్) సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖర్జీ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అఖండ భారత దేశ స్ఫూర్తిని గుండెగుండెలోనూ రగిలించిన జాతీయవాది, నిరాడంబరతకు నిదర్శనంగా నిలిచిన జననేత, స్ఫూర్తిప్రదాత డాక్టర్.శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు కోసం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పట్టుపట్టారని, ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం ఉండాలని కోరుకున్నారని తెలిపారు. అందులో భాగంగానే మోదీ ప్రభుత్వం వచ్చాక ఆర్టికల్ 370డి రద్దు చేశారని గుర్తుచేశారు. శ్యాంప్రసాద్ ఆశయాలను మోదీ ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూలనాగరాజు, భువనేశ్వరిసత్య, కోసూరిభవాని, సంతోష్, బుజ్జి, కొండయ్య, విజయ్, ఎం.వేణుగోపాల్, పిల్లస్వామినాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుద్ధ్య పనులు



బస్టాండు ఆవరణలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న డీఎం కుమార్

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆదివారం డీఎం కుమార్ పర్యవేక్షణలో బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ బస్టాండు ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయరాదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి చెత్తాచెదారం వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరాధం రుసుం విధిస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణీకులకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బస్టేషన్ మేనేజర్ బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన మదనపల్లె ఎమ్మెల్యే



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జనసేన నాయకులు

మదనపల్లె : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన జనసేన నాయకులు రామరామాంజనేయులు, దారం అనితలతో కలిసి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలుసుకున్నారు. ఎన్నికల్లో కూటమి ఏర్పాటుకు కృషిచేయడమే కాకుండా, ఘనవిజయానికి కారకులయ్యారని పవన్‌కల్యాణ్‌ను అభినందించారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా మదనపల్లె నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి సన్మానం



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీరామ్‌చినబాబు తదితరులు

మదనపల్లె : రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా ఆదివారం పదవీబాధ్యతలు చేపట్టిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలోని రవాణాశాఖ మంత్రి చాంబర్‌లో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందించారు. అన్నమయ్యజిల్లా రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, తొలిసారిగా మంత్రి పదవి చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దొరస్వామినాయుడు పాల్గొన్నారు.

27 నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

మదనపల్లె సిటీ: సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఈనెల 27 నుంచి రాష్ట్ర స్థాయి సీనియర్ బాలుర హాకీ పోటలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య హాకీ కార్యదర్శి శివప్రసాద్, కోచ్ నౌషాద్ తెలిపారు. ఈ పోటీలకు జిల్లా స్థాయిలో జట్టును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టు రాష్ట్రర స్థాయి పాల్గొంటారని తెలిపారు.

రెడ్డెమ్మ తల్లీ...చల్లంగ చూడమ్మా



సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగ చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారికి భకిత్ శ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడం గమనార్హం.

కామ్రేడ్ తారకనాథ్ సేవలు విలువైనవి

రాజంపేట టౌన్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల కోసం కామ్రేడ్ తారకనాథ్ చేసిన సేవలు ఎంతో విలువైనవని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ నాయకులు ఎం.విరూపాక్ష తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంక్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ తొలి ప్రధాన కార్యదర్శి దివంగత తారకనాథ్ 20వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ రాజంపేట రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 51 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విరూపాక్ష మాట్లాడారు. ఎస్‌బీఐ ఉద్యోగుల కోసం కామ్రేడ్ తారకనాథ్ చేసిన గుర్తు చేసుకున్నారు. బ్యాంకు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన బాటలో పయనిద్దామని తెలియజేశారు. తారకనాథ్ 32 సంవత్సరాల వయస్సులోనే స్టాఫ్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించారని తెలిపారు. అలానే రక్తదానం విలువను ఆయన వివరించారు. తమ యూనియన్ ద్వారా తమవంతు రక్తం అందించేందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

మాధవరెడ్డి సేవలు మరువలేనివి



కోన పోస్ట్‌మాస్టర్ మాధవరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కలకడ : మండలంలోని కోన తపాలశాఖ బ్రాంచ్ మాస్టర్ యర్రగొండ మాధవరెడ్డి సేవలు మరువలేనివని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు శేషాద్రి, కార్యదర్శి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని కె.బాటవారిపల్లె ఉన్నత పాఠశాల ఆవరణంలో కలకడ తపాలశాఖ పోస్ట్‌మాస్టర్ కె.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన పదవీ విరమణ వీడ్కోలు సమావేశంలో మాధవరెడ్డి దంపతులను ఘనంగ సన్మానించి జ్ఞాపిక అందజేశారు మాధవరెడ్డి 43 సంవత్సరాలు సొంత ఇంటిని ఉచితంగా తపాలశాఖ కార్యాలయం కోసం కేటాయించి సేవలు అందించారన్నారు. గ్రామీణ ప్రాంతంలో పొదుపులు పెంచి, ఉపాధీ హామీ పథకంలో కూలీలకు సకాలంలో చెల్లింపులు చేసి, నిత్యం అందుబాటులో ఉండి ఎలాంటి సమస్యలు లేకుండా విధులు పూర్తి చేసినట్లు కొనియాడారు. కార్యక్రమంలో డివిజనల్ కార్యదర్శి వెంకట్రామయ్య, కార్యవర్గ సభ్యులు మురళి, కమల్‌నాథ్, మునుస్వామి, సాయికుమార్, రఫీ, ఆకాష్, అక్కులప్ప, మునిలక్ష్మి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నిసార్‌అహ్మద్ కుమార్తె వేడుకల్లో పాల్గొన్న ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, చింతల

మదనపల్లె : మదనపల్లె వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ కుమార్తె వివాహ వేడుక ఆదివారం పట్టణంలోని రామతులసమ్మ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది.

వివాహ వేడుకల్లో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, కదిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మగ్బూల్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, మాజీ ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, జెడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డి, నిమ్మనపల్లె రెడ్డిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రాటకొండబాబురెడ్డి, జనసేన నాయకులు గంగారపు రామదాస్‌చౌదరి, జంగాలశివరాం, కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు హాజరయ్యారు. వధూవరులు డాక్టర్. రహత్‌షేక్, డాక్టర్.సనాఖాన్ పర్వేజ్‌నవాజ్‌లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడా దుస్తులు, సర్టిఫికెట్లతో క్రీడాకారులు

– చింతల శ్రీధర్ రెడ్డి

వాల్మీకిపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాస్కెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పీవీసీ ప్రభుత్వ పాఠశాల క్రీడామైదానంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు సందర్భంగా క్రీడాకారులకు క్రీడా దుస్తులు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ రవిచందర్ మాట్లాడుతూ బాస్కెట్ బాల్‌కు మంచి వేదిక దొరకడం ఈ ప్రాంత యువతకు మంచి వరం అని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. చింతల శ్రీధర్ రెడ్డి సొంత నిధులతో క్రీడాకారులకు నెల రోజుల పాటు ఉచితంగా బాస్కెట్ బాల్ శిక్షణ ఇవ్వడంతో పాటు పౌష్టికాహారం అందించడంతో పాటు క్రీడా దుస్తులు, సర్టిఫికెట్లను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, సాయిభార్గవ్, శ్రీనివాసులు రెడ్డి, రైల్వే రవీంద్ర, యూసఫ్ బాష, యువరాజు, కోచ్‌లు అంజిబాబు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా మురుగు కదలలేదు..!

- దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు
- చిన్నా పాటి వర్షానికే మడుగు
- కాలువ విస్తరణ చేయాలని ప్రజల విన్నపం



మినర్వ టీ స్టాల్ వద్ద తవ్వేసిన మురుగునీటి కాలువ

మదనపల్లె సిటీ: స్థానిక అబ్బయ్యగారివీధిలో మురుగు కాలువలో నీరు కదలలేదు. మురుగునీరు అక్కడే చిన్నచెరువులా నిలిచిపోయింది. గత నెల రోజుల నుంచి మురుగునీటి కూపంగా మారింది. దీంతో మున్సిపల్ సిబ్బంది కాలువ నుంచి మురుగునీరు వెళ్లేందుకు తవ్వకాలు చేపట్టారు. అయితే మురుగునీరు వెళ్లేలేదు. దీంతో అప్పటి నుంచి పనులు ఏమి చేయకుండా నిలిపివేశారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నీటి మడుగులా మారుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మరుగునీటి కాలువ వెడల్పు చేసి మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

• టమాటాయ్



ఇది బొమ్మ అనుకుంటే పొరపాటే. బొమ్మలాగ ఉన్న టమటా. మదనపల్లె మార్కెట్‌లో ఆదివారం నాగయ్య టమటా మండీకి ఓ రైతు టమటాలు తీసుకువచ్చాడు. టమటాల్లో ఓ కాయ బొమ్మ ఆకారంలో కనిపించింది. దీన్ని చూసిన మండీ యజమాని తన టేబుల్‌పై పెట్టుకున్నారు. మండీకి వచ్చే వ్యాపారులు, వినియోగదారుల చూపును టమా'టాయ్' ఆకట్టుకుంది.

-మదనపల్లె సిటీ